క్లుప్తంగా

రైతు సంక్షేమమే ధ్యేయం

- మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్
- డ్రిప్‌పైపుల ప్రొసీడింగ్ అందజేత



ప్రొసీడింగ్ అందజేస్తున్న నాయకులు, అధికారులు

దౌల్తాబాద్: రైతు సంక్షేమమే ధ్యేయమని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని 30 మంది రైతులకు మంజూరైన డ్రిప్ పైపుల ప్రొసీడింగ్‌లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి డ్రిప్‌పైపుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు మంజూరవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఉద్యానశాఖ అధికారి సురేంద్రనాథ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న, మాజీ ఎంపీటీసీ దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి చేరిన బీఆర్ఎస్ నాయకులు



పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

పూడూరు: మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సల్మాతాజోద్దీన్, మాజీ ఎంపీపీ తనయుడు శ్రీనివాస్‌గుప్తా పలువురు నాయకులు ప్రగతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ సమక్షంలో సొంత గూటికి చేరారు. పూడూరు మండలం నుంచి వందల సంఖ్యల్లో కార్యకర్తలు, నాయకులు వాహనాల్లో ప్రగతిభవన్‌కు తరలి వెళ్లారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిగిలో పార్టీకి పూర్వ వైభవం తెస్తామని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అజీం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు సురేందర్, అజారుద్దీన్, నాయకులు రాజేందర్‌రెడ్డి, రహీస్‌ఖాన్, హరీశ్వర్‌రెడ్డి, పాండు, ఇస్మాయిల్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాండూరు రూరల్: గోట్లపల్లి గ్రామంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చింది. ఎల్ఎస్ఆర్ యువసేన, ఎంఎన్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన శిబిరంలో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30 మందికి కంటి ఆపరేషన్ కోసం సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో చందప్ప, రఫిక్, మల్లప్ప, శ్రీశైలం, రాంరెడ్డి, సురేష్, సంగమేశ్వర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

నవాబుపేట: మండల పరిధిలోని మీనపల్లి కలాన్ ఉన్నత పాఠశాలకు కుర్చీలు అందజేశారు. గ్రామానికి చెందిన తలారి శేఖర్ తను చదువుకున్న పాఠశాలకు 10కుర్చీలను సహాయం చేశాడు. ఈ సందర్భంగా అతనిని ఉపాధ్యాయులు బాలేశ్వర్, మల్లేశం అభినందించారు.

కొందుర్గు ఏపీఎం ఎవరు?

వచ్చిన రెండు రోజులకే మరో చోటకు బదిలీ

కొందుర్గు: ఇదివరకు కొందుర్గు మండల మహిళా సమాఖ్యలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న జయమాలిని జూలై 31న ఫరూఖ్‌నగర్ బదిలీపై వెళ్లారు. అదే సమయంలో నల్గొండ జిల్లా కేతెపల్లి ఏపీఎంగా పనిచేస్తున్న యాదమ్మ కొందుర్గు ఏపీఎంగా బదిలీపై వచ్చారు. ఆమె ఈ నెల 1న కొందుర్గు ఏపీఎంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కొందుర్గు మండల మహిళా సమాఖ్య సిబ్బంది యాదమ్మకు ఘనంగా స్వాగతం పలికారు. కాగా ఆమె గురువారం కొందుర్గు నుంచి మేడ్చల్ బదిలీపై వెళ్లారు. దీంతో కొందుర్గు ఏపీఎం ఎవరూ అని ప్రశ్నార్థకంగా మారింది. బదిలీపై వచ్చిన నాలుగు రోజులకే తిరిగి వెళ్లడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పాములు ప్రవేశిస్తున్నాయి!



నాజుఖాన్ పల్లి పాఠశాల

- నాజుఖాన్‌పల్లి పాఠశాలకు ప్రహరీలేక చొరబాటు
- చెరువు, పొలాలు సమీపంలో ఉండడంతో ప్రవేశం
- భయాందోళనలో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



పాఠశాల ఆవరణలోకి వచ్చిన పాములు

దుద్యాల్: మండల పరిధిలోని నాజుఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల గ్రామానికి దూరంగా, చెరువుకు, పొలాలకు ఆనుకుని ఉండడంతో పాములు ప్రవేశిస్తున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు విష సర్పాలు జొరబడుతుంటాయి. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి భయపడుతున్నారు. మూడు వైపుల గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా తయారైంది. రోడ్డు వైపు మాత్రమే ప్రహరీ ఏర్పాటు చేశారు. ఈ పాఠశాల అవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉండడంతో నిత్యం విద్యార్థులతో పాటు సిబ్బంది కూడా భయాందోళనకు గురవుతున్నట్లు వాపోతున్నారు. దీంతో చిన్న పిల్లలు, విద్యార్థులు పాఠశాలకు రావాలంటే జంకుతున్నారు. చెరువులో నుంచి, పొలాలనుంచి ఒడ్డుకు పాములు చేరి దగ్గర్లో ఉన్న ఆ పాఠశాలలో ప్రవేశిస్తున్నాయి. ప్రమాదవశాత్తు విద్యార్థులు పాము కాటుకు గురై జరగరానిది ఏదైన సంభవిస్తే బాధ్యులు ఎవరని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవలే పాఠశాలలో పాము రావడంతో అప్రమత్తమైన విద్యార్థులు గ్రామస్తుల సహాయంతో పాఠశాల ఆవరణలో చంపేశారు. ఇక్కడ పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో కలిపి దాదాపు 30 మంది వరకు విద్యార్థులు నిత్యం వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భయంగా ఉంటుంది



పాఠశాలకు వెళ్లడానికి భయంగా ఉంటుంది. ఎప్పుడు పాములు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాలకు చెరువు, పొలాలు దగ్గరగా ఉండడంతో తరచూ వస్తున్నాయి. పాఠశాల ప్రారంభం నుంచి నేటి వరకు దాదాపుగా 10 పాములు పాఠశాల ఆవరణలోకి వచ్చాయి. గ్రామస్తుల సహాయంతో వాటిని చంపేయిస్తున్నాం. వాటిని చంపాలంటే ఇబ్బందిగా ఉంది.

స్ఫూర్తి, విద్యార్థిని, రెండోతరగతి

అధ్యాపకులను నియమించాలని ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

- రెండు నెలలుగా ఆన్‌లైన్లోనే తరగతులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు

పరిగి: తుంకుల్‌గడ్డలోని గిరిజన బాలికల కళాశాలలో అధ్యాపకులను నియమించాలని కోరుతూ విద్యార్థినులు ధర్నా నిర్వహించారు. రెండు నెలలుగా ఆన్‌లైన్లోనే తరగతులు వింటున్నామని, పూర్తిస్థాయి బోధన అధ్యాపకులు లేక తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణ కేంద్రంలోని విద్యారణ్యాపురి (తుంకుల్‌గడ్డ)లోని గిరిజన బాలికల కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా గణితం, రసాయనశాస్త్రంలో బోధన అధ్యాపకులు లేక తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. డిజిటల్ క్లాసులు విని సర్దుకు పోవాలని సూచిస్తున్నారని చెబుతున్నారు. డిజిటల్ క్లాసుల ద్వారా వచ్చే సందేహాలను ఎవరితో నివృత్తి చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. కళాశాలకు అధ్యాపకులను నియమించేంత వరకు తరగతులకు వెళ్లేది లేదని భీష్మించుకూర్చున్నారు. ఇప్పటికే సగం క్లాసులు పూర్తవాలి. కానీ బోధన అధ్యాపకులు లేక వెనుకబడిపోయినట్లు చెబుతున్నారు. అనంతరం ధర్నా చేస్తున్నారనే విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్ అక్కడికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే అధ్యాపకులను నియమించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



తాండూరు రూరల్: కందనెల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వేణుకుమార్

ఎస్‌ఐ వేణుకుమార్

తాండూరు రూరల్: సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని పెద్దేముల్ ఎస్‌ఐ వేణుకుమార్ పేర్కొన్నారు. గురువారం పెద్దేముల్ మండలం కందనెల్లిలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. స్థానికులు, దాతల సహకారంతో గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్‌చారి, మోహన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, మహేష్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు

దుద్యాల్: సీసీ కెమెరాలతో నేరాల అదుపు చేయొచ్చని గ్రామ పోలీస్ అధికారి రవితేజ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆలేడ్‌లో నాలుగు సీసీ కెమెరాలను గురువారం ఏర్పాటు చేశారు. ఊటుపల్లి యాదయ్య అనే వ్యక్తి స్వంత ఖర్చుతో ఏర్పాటు చేయించినట్లు రవితేజ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పోలీస్ అధికారి రవితేజ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు అందుబాటులో ఉండడం శుభపరిణామమన్నారు. ఏదైనా దొంగతనాలు, ప్రమాదాలు జరిగినప్పుడు వాటి ద్వారా నిందితులను పట్టుకోవచ్చని పేర్కొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యం



బంట్వారం: కోట్‌పల్లిలో మాట్లాడుతున్న ధనలక్ష్మి



దోమ: చెర్లతండాలో మాట్లాడుతున్న టీచర్ కమల

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి

బంట్వారం: పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగిస్తే ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. పిల్లల ఆరోగ్యంపై తల్లులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు సుహాసిని, జ్యోతి, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో మేలు

దోమ: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి దోహదపడుతుందని చెర్లతండా అంగన్‌వాడీ టీచర్ కమల పేర్కొన్నారు. చెర్లతండాలోని అంగన్‌వాడీకేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. శిశువు పుట్టిన దగ్గర నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలు పట్టియాలన్నారు. తల్లిపాలు బిడ్డకు మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడుతాయని చెప్పారు. అంతకు ముందు గర్భిణులకు చీరలు, పండ్లు, పసుపు కుంకుమ, బాలమృతం, అతిథులకు పంపిణీ చేశారు.

హామీలను గాలికి వదిలేసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేసి పాలన చేస్తోందని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో పలువురు మండల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. స్థానిక ఎన్నికలను నిర్వహించకుండా బీసీల కోసం అంటూ కొత్త రాగం ఎత్తుకొని కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు, అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఏడాదిన్నర కాలంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గానికి దాదాపు 3 కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారన్నారు. ఈ ప్రభుత్వం కాని, ఎమ్మెల్యే ఈ నియోజకవర్గంలో 10 ఏళ్లకుపైగా పనిచేసి.. చేసిన అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. అభివృద్ధి కోసమే పార్టీలు మారుతున్నానని.. అధికారం ఉన్న పార్టీలోకి మారి చేసింది ఏమిటో చూపించాలని డిమాండ్ చేశారు. ఎవరు స్వార్థం కోసం పార్టీలు మారి ఏమి చేస్తున్నారోనని ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. చేవెళ్లలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, మొయినాబాద్‌లో జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి వైభవ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి ఉన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయండి

శంకర్‌పల్లి: మండలంలో ఈ నెల 11 నుంచి 15 వరకు నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల వైద్యాధికారి రేవతిరెడ్డి, విద్యాధికారి అక్బర్, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దీనిలో ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని సూచించారు. మొదటగా గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలను గుర్తించి, దానికి అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గురుదోట్ల పాఠశాలలో రక్షాబంధన్



రాఖీ కడుతున్న విద్యార్థినులు

ధారూరు: మండల పరిధిలోని గురుదోట్ల గ్రామ పాఠశాలలో గురువారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎల్లప్ప, ఉపాధ్యాయులు అశ్విని, బాల్‌రాజ్, వెంకటయ్య, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి

ఎంపీడీఓ సంధ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఓటరు లిస్టును వార్డుల వారీగా పారదర్శకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడూ పారిశుధ్య పనులు చేయించాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. సమావేశంలో మండల ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నగర కమిటీ ఎన్నిక



నూతన నగర కమిటీ సభ్యులు

మొయినాబాద్: ఏబీవీపీ మొయినాబాద్ నగర కమిటీ ఎన్నిక గురువారం మున్సిపల్ కేంద్రంలో జరిగింది. సిద్ధార్థ కళాశాలలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చందు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కమిటీ కార్యదర్శిగా బట్టు వినయ్‌కుమార్‌యాదవ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా నితిన్‌గౌడ్, మహేశ్, సహాయ కార్యదర్శులుగా సంజయ్, సంజయ్‌యాదవ్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా భార్గవ్‌రామ్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్‌గా బన్ని, సోషల్ మీడియా కన్వీనర్లుగా చరణ్, హేమంత్, హాస్టల్ కన్వీనర్‌గా దేవేందర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా విజయ్ కుమార్, శ్రీకాంత్, నర్సింహారెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ గోపి నాయక్

దుద్యాల్: సత్తర్‌కుంట తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఏకరూప దుస్తువులను ఉమ్మడి బొంరాస్‌పేట్ మండల మాజీ ఎంపీపీ గోపి నాయక్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాఠశాలలో విద్యార్థులకు అందించిన మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందజేస్తున్నారు. చిన్నారులకు నిత్యం మెరుగైన విద్యా నేర్పించాలని, పూర్వ ప్రాథమిక దశలో చదువుపై ఆసక్తిపెంచుకుంటే ప్రాథమిక దశలో బాగా నేర్చుకుంటారన్నారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పెంటమ్మ, పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వర్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, తండా వాసులు దేవా నాయక్, హరిచందర్ నాయక్, ధన్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదె కళేబరం



పరిగి: ఎద్దు కళేబరం

దౌల్తాబాద్: మండలంలోని గుండేపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఆశిరెడ్డికి చెందిన గేదె మేత కోసం పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లింది. ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తాకి అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

విద్యుదాఘాతంతో కాడెద్దు..

పరిగి: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తొండుపల్లి రోషన్‌కు చెందిన ఎద్దు మేత మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ.80వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో రైతు లబోదిబోమని బోరున విలపించాడు. ఈ విషయంలో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ప్రాథమికోన్నత పాఠశాల పునఃప్రారంభం



పాఠశాలకు మైక్‌సెట్ అందిస్తున్న తల్లి అనురాధతో కొడుకులు తదితరులు

ధారూరు: దోర్నాల్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పునః ప్రారంభించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గతంలో కొనసాగిన ప్రాథమికోన్నత పాఠశాలకు తగినంత విద్యార్థులు రాకపోవడంతో ప్రాథమిక పాఠశాల స్థాయికి తగ్గించారు. తిరిగి ఈ సంవత్సరం ఆరోతరగతిలో విద్యార్థులు చేరడంతో ప్రాథమికోన్నత పాఠశాలను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని ప్రభుత్వ బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.

పాఠశాలకు మైక్‌సెట్ విరాళం..

వీఓఏ మంగలి అనురాధ తన కుమారులు ఆదర్స్, సాయితేజల పేర్లతో పాఠశాలకు ఉచితంగా మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్, పాఠశాల హెచ్‌ఎం శేఖర్, మాజీ సర్పంచు నర్సింహారెడ్డి, సీఆర్‌పీ రాజశేఖర్, ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డివైడర్

- కానరాని సూచిక బోర్డులు
- తరచూ ప్రమాదాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ఖాంజాపూర్ గేట్ సమీపంలో డివైడర్ చివర ఢీకొట్టిన కారు

తాండూరు టౌన్: రోడ్డుకు ఇరువైపులా వాహనాలు సక్రమంగా వెళ్లాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన డివైడర్ వాహనదారులకు శాపంగా మారింది. వేగంగా వచ్చే వాహనాలకు ఇవీ కనిపించక పోవడంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాండూరు పట్టణంలోని విలియంమూన్ చౌక్ నుంచి ఖాంజాపూర్ గేట్ వరకు డివైడర్‌ను నిర్మించారు. అక్కడే డివైడర్ నిర్మాణాన్ని నిలిపేశారు. అయితే ఖాంజాపూర్ గేటు వద్ద ఎతైన ప్రాంతం ఉండటంతో వికారాబాద్ నుంచి తాండూరు వైపు వేగంగా వచ్చే వాహనాలు, దిగువ ప్రాంతం నుంచి ఎత్తు ప్రాంతానికి చేరుకోగానే అకస్మాత్తుగా రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ కనిపించక కంగారులో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. దూరం నుంచి వచ్చే వాహనాలకు సైతం రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్ కనపడేలా ఆర్ అండ్ బీ అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు కానీ లేదా రేడియం స్టిక్కర్లు కానీ ఏర్పాటు చేయకపోవడంతో నేరుగా వాహనాలు వచ్చి ఢీకొంటున్నాయి. తాజాగా ఓ కారు ఇలాగే ఢీకొట్టడంతో అందులోని ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఐనప్పటికీ ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. గతంలో కూడా పలు లారీలు డివైడర్‌ను ఢీకొట్టి ప్రమాదాల బారిన పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్ చివర సూచిక బోర్డు లేదా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయించాలని, వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.